ప్రజాశక్తి

శుక్రవారం 28 జూన్ 2024 | 5 | విజయనగరం




9న తపాలా అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం పోస్టల్ డివిజన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించే నిమిత్తం జులై 9న ఉదయం 10గంటలకు సూపరింటెండెంట్ కార్యాలయంలో తపాలా అదాలత్, పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు తపాలా శాఖ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు తెలిపారు. తపాలా సర్వీసులకు సంబంధించిన ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులు మాత్రమే ఈ అదాలత్‌లో చర్చించనున్నట్లు తెలిపారు. డివిజన్‌లోని పోస్టల్ వినియోగదారులు తమ సమస్యలను, ఫిర్యాదులను వచ్చేనెల 8లోగా తపాలా శాఖకు పంపాలని కోరారు. గడువు తేది తరువాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని తెలిపారు. ఫిర్యాదుదారులు వ్యక్తిగతంగా కూడా అదాలత్‌కు హాజరు కావచ్చునని తెలిపారు.

ప్రారంభమైన పంటల సాగు



- 4వేల ఎకరాల్లో చెరకు, నువ్వులు, మొక్కజొన్న, పత్తి తదితరాలు
- 302 ఎకరాల్లో వరి నారు
- అన్నిరకాల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయంటున్న అధికారులు
- ఆర్‌బికె, మార్క్‌ఫెడ్, ప్రైవేటు డీలర్ల ద్వారా ఎరువుల పంపిణీ
- ఆశాజనకంగా వర్షాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. రైతులు పంటల సాగులో తలమునకలవుతున్నారు. ముఖ్యంగా చెరకు, నువ్వులు, మొక్కజొన్న, పత్తి సాగు ముమ్మరంగా సాగుతోంది. వరి నారుపోత కూడా కొన్ని మండలలాల్లో ప్రారంభమైంది. విత్తనాలు, ఎరువులు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.ఇవన్నీ ఆర్‌బికెలు, మార్క్‌ఫెడ్, ప్రైవేటు డీలర్ల ద్వారా పంపిణీకి చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ఇప్పటి వరకు వర్షాలు ఆశాజనకంగానే ఉన్నాయని ఇటు రైతులు, అటు అధికారులు చెబుతున్నారు.

ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో అన్ని పంటలూ కలుపుకుని 2,99,455 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా, ఇప్పటి వరకు చెరకు, నువ్వులు, మొక్కజొన్న, పత్తి, మెస్తా, వేరుశనగ పంటలు, పెసలు, మినుములు, కందులు తదితర అపరాలు 4025 ఎకరాల్లో సాగయ్యాయి. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సాగు విస్తీర్ణం శరవేగంగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అత్యధికంగా వరి సాధారణ విస్తీర్ణం 2,25,145 ఎకరాలుగా అధికారులు నమోదు చేశారు. ఇందుకోసం 11,255 ఎకరాల్లో నారు పోయాల్సివుండగా, ఇప్పటి వరకూ ఆరు మండలాల్లో (వంగర, రేగిడి ఆమదాలవలస, సంతకవిటి, బొబ్బిలి, మెరకముడిదాం, గజపతినగరం) 302 ఎకరాల్లో నారు పోత చేపట్టారు. ఇందులోనూ ఎక్కుగా సంత కవిటి మండలంలో 212 ఎకరాలు ఉంది. వరి విత్తనాలు జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సాధారణ విస్తీర్ణాన్ని బట్టి 46,530 క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా, 40,328 క్వింటాళ్లు జిల్లాకు చేరినట్టుగా అధికారిక రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం 12రకాలు విత్తనాలు ప్రభుత్వం తరపున సరఫరా చేస్తున్నప్పటికీ అత్యధికంగా ఎంటియు 1121 రకం 35,1534 క్వింటాళ్లు అవసరం కానున్నట్టు జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపగా, ఇప్పటి వరకు 33,336 క్వింటాళ్లు జిల్లాకు చేరాయని అధికారులు తెలిపారు. వరి మినహా ఇతర పంటలన్నింటికీ 1220 క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా, 457 క్వింటాళ్లు జిల్లాకు చేరాయి.

యూరియా, డిఎపి, ఎంఒపి, ఎస్ఎస్‌పి, కాంప్లెక్స్ ఎరువులు 51,476 మెట్రిక్ టన్నుల మేర అవసరం కాగా, ఇప్పటి వరకు 25,299 మెట్రిక్ టన్నుల వరకు జిల్లాకు వచ్చింది. ఇందులో అత్యధికంగా 18,160 మెట్రిక్ టన్నుల వరకు ప్రైవేటు డీలర్ల వద్ద ఉండడం గమనార్హం. ఆర్‌బికెల్లో 5,949, మార్క్‌ఫెడ్‌లో 1190 మెట్రిక్ టన్నులు వరకు నిల్వలు ఉన్నాయి. ఈఏడాది 510 ఆర్‌బికెల పరిధిలో 21,200 భూసార పరీక్షలు నిర్వహించాలని అధికార యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు 3,338 పరీక్షలు చేపట్టారు.

మునుపెన్నడూ లేనంతగా జూన్ ప్రారంభం నుంచే వర్షాలు అనుకూలించడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమౌతోంది. ముఖ్యంగా వర్షాలు అనూకూలించడం ఇందుకు కారణం. సాధారణంగా మన జిల్లాలో ఖరీఫ్ సీజన్ జూన్ నుంచి ప్రారంభమౌతుంది. ఇప్పటివరకు 109 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సివుండగా, 153 మి.మీ వర్షపాతం నమోదైంది. 41 మి.మీ వర్షం అధికంగా కురవడంతో వరి నారు మడులు దాదాపు సిద్ధమయ్యాయి. వివిధ రకాల పంటల సాగు కూడా ప్రారంభమైంది.

జిల్లా అంతటా వర్షాలు

జిల్లా వ్యాప్తంగా 26.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా బాడంగి మండలంలో 149.4 మి.మీ.వర్షం కురవగా, అత్యల్పంగా గుర్ల మండలంలో 2.2మి.మీ. వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా వర్షం పడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వర్షపాతం	
ఎస్.కోట	3.2
వంగర	17.4
జామి	17.4
నెల్లిమర్ల	22.4
తెర్లాం	33.2
లక్కవరపుకోట	26.6
పూసపాటిరేగ	20.8
రేగిడి	14.8
రాజాం	48.6
విజయనగరం	35.2
సంతకవిటి	41.2
గుర్ల	2.2
గరివిడి	7.6
భోగాపురం	28.2
కొత్తవలస	9.2
మెరకముడిదాం	39.2
మెంటాడ	13.0
బాడంగి	149.4
గంట్యాడ	12.8
చీపురుపల్లి	5.4
దత్తిరాజేరు	17.8
బొబ్బిలి	36.4
రామభద్రపురం	29.6
బొండపల్లి	5.2
గజపతినగరం	14.8
డెంకాడ	21.6
వేపాడ	51.8

కార్పొరేట్ విద్యాసంస్థల్లో

పుస్తకాల విక్రయాన్ని అరికట్టాలి

కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పుస్తకాల విక్రయాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. విద్యార్థుల నుంచి పుస్తకాల పేరిట వేలాది రూపాయలు వసూలు చేస్తున్నందున కలెక్టర్ కలుగజేసుకొని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము మాట్లాడుతూ అక్రమంగా పుస్తకాల విక్రయాన్ని గుర్తించి ఆందోళనలు చేసి గదులను సీజ్ చేయిస్తుంటే విద్యాశాఖ అధికారులు మళ్లీ వాటిని విడిపిస్తున్నారన్నారు. ఇటీవల బొబ్బిలిలో సురేష్ స్కూల్ యాజమాన్యం స్కూల్ పేరుమీద పుస్తకాలు ప్రింట్ చేసి అమ్ముతుంటే అధికారులు ఆ గదిని సీజ్ చేసారన్నారు. నాలుగు రోజులు తరువాత ఆ సీలు తీసేసి యాజమాన్యం పుస్తకాలను మళ్లీ విక్రయించిందన్నారు. సీజ్ చేసిన గదిని ఎందుకు ఓపెన్ చేసారని అడిగితే డిప్యూటీ డిఇఒ ఓపెన్ చేసుకోమన్నారని యాజమాన్యం తెలియజేసిందన్నారు.దీనిపై ఆందోళన చేస్తే ఎంఇఒ సంఘటనా స్థలానికి వచ్చి కూడా చూసి చూడనట్లు వెళ్లిపోయారని తెలిపారు. విద్యాహక్కు చట్టాన్ని కాపాడాల్సిన అధికారులే ఇలా చేస్తే ఎలా అని ప్రశ్నించారు. విద్యాహక్కు చట్టాన్ని అతిక్రమించిన సురేష్ స్కూలను సీజ్ చేయాలని అన్నారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శులు సమీరా, రమేష్, నాయకులు రాజు, వంశీ, ఎర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : పుస్తకాల పేరుతో విచ్చలవిడిగా విద్యార్థుల తల్లిదండ్రులను జలగల్లా పీడిస్తున్న నారాయణ, శ్రీచైతన్య కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయా కళాశాలల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి మణికుమార్ మాట్లాడుతూ పాఠశాలల్లో, కళాశాలల్లో పాఠ్య పుస్తకాలు అమ్మకూడదని ప్రభుత్వ నిబంధనలు ఉన్నా బొబ్బిలిలోని ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాల వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. వీటిని అడ్డుకోవాల్సిన అధికారులు ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. శ్రీ చైతన్య కళాశాల భవన నిర్మాణం పూర్తికాకుండానే తరగతులు ప్రారంభించేందుకు విద్యాశాఖ అధికారులు ఎలా అనుమతి ఇస్తారని ప్రశ్నించారు. తక్షణమే విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు కిరణ్, మండల నాయకులు సాయి మణి, చరణ్ పాల్గొన్నారు.

నారాయణ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

విద్యా శాఖాధికారికి పిపిఎస్ఎస్ వినతి



వినతి అందిస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భవన నిర్మాణాలు పూర్తి కాకుండానే తరగతులు ప్రారంభించిన నారాయణ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం నాయకులు జిల్లా విద్యా శాఖ ఎడి గౌరీ శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రదీప్ నగర్ సమీపంలోని నోబుల్ నగర్‌లో నిర్మాణం జరుగుతున్న నారాయణ సిబిఎస్ఇ స్కూల్‌ను ప్రారంభించడం అన్యాయమన్నారు. భవనాలు నిర్మాణంలోనూ అండగా పాఠశాల ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. జిల్లా అధికారులు ఏ విధంగా అనుమతి ఇచ్చారన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. వెంటనే నారాయణ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. తమ పిల్లలకు రక్షణ కల్పించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం నాయకులు యుఎస్ రవికుమార్, బి.రమణ, పి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుటీ అమలు చేయాలి

ఎమ్మెల్యేకు అంగన్వాడీల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వేతనాలు పెంచి గ్రాట్యూటీ అమలు చేయాలని కోరుతూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజుకు గురువారం వినతి అందజేశారు. ముందుగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని యూనియన్ జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు బి. పైడ్రాజు, ఎస్ అనసూయ, జిల్లా కమిటీ సభ్యులు కె ప్రభావతి, ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు శివలక్ష్మి, విశాలాక్షి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ సమయంలో తీవ్ర నిర్బంధాన్ని, ఎస్మాను ఎదుర్కొని 42 రోజులు సమ్మె చేశామని, ప్రధానమైన జీతం పెంపు, గ్రాట్యుటీ అమలు వంటి సమస్యల పరిష్కరించలేదని తెలిపారు. కొన్ని జీవోలు ఇచ్చిన, ఇంకా కొన్ని జీవోలు రావాల్సి ఉందని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లు గా మార్చాలని, పని భారం తగ్గించాలని, గ్యాస్ ఉచితంగా ఇవ్వాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సిఐటియు నగర అధ్యక్షులు ఎ. జగన్మోహన్రావు, సెక్టార్ లీడర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు తైక్వాండో జట్టు ఎంపిక

విజయనగరం టౌన్ : ఈనెల 30 నుండి విశాఖపట్నంలో జరుగు 7వ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు స్థానిక విజ్జీ స్టేడియంలో గురువారం జిల్లా స్థాయి ఎంపిక నిర్వహించారు. జిల్లా నుంచి అండర్-12,13,14 విభాగాల్లో 50 మంది పాల్గొన్నారు. అధ్యక్షులు డివి చారి, ఉపాధ్యక్షులు అనిల్ కుమర్ శర్మ, కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. బాలుర విభాగంలో ఎస్‌కె అబ్దుల్లా, సాయి చైతన్య, ఎస్ఆర్ఎస్ అవినాష్, సత్య శివ మణికంఠ, ఎస్‌కె అహమద్, బాలికల విభాగంలో అర్.సృజన, ఎ.దీక్ష శ్రీ, డి.అభిశ్రీ, జి.హర్షిణి ఎంపికయ్యారు. వీరికి డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు , తైక్వాండో జిల్లా కార్యదర్శి త్రినాథరావు అభినందనలు తెలియజేశారు.

శివారు భూములకూ సాగునీరు

- సాగునీటి కాల్వల నిర్వహణ, పూడికతీతకు ప్రతిపాదనలివ్వండి
- కలెక్టర్ అంబేద్కర్ ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రస్తుత ఖరీఫ్ సీజనులో జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో వున్న ఆయకట్టు చివరి భూములకూ సకాలంలో సాగునీటిని అందించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. సాగునీటి కాల్వల నిర్వహణ, పూడికతీత వంటి అత్యవసర పనులకు అవసరమైన నిధుల ప్రతిపాదనలు అందజేస్తే ప్రభుత్వానికి నివేదించి నిధుల మంజూరు కోసం ప్రయత్నిస్తామని చెప్పారు. గురువారం తన చాంబరులో జలవనరుల శాఖ ఆధ్వర్యంలోని సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి, ప్రస్తుత సీజనులో ఆయా ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తదితర అంశాలపై ఆ శాఖ ఇంజనీర్లతో సమీక్షించారు. జిల్లాలోని తోటపల్లి, తాటిపూడి, ఆంధ్ర వంటి సాగునీటి ప్రాజెక్టుల కాల్వల్లో పూడికతీత పనులు, నిర్వహణ పనులు చేపట్టేందుకు, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో పనులకు కలసి రూ.4.30 కోట్లు అవసరం వుంటుందని జలవనరుల శాఖ ఉత్తర కోస్తా చీఫ్ ఇంజినీర్ ఎస్.సుగుణాకర రావు, ఆయా ప్రాజెక్టుల కార్యనిర్వాహక ఇంజనీర్లు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ కు సంబంధించి ఎనిమిది ప్రాజెక్టులకు గాను తోటపల్లి, తాటిపూడి, మడ్డువలస, పెద్దగెడ్డ తదితర నాలుగు ప్రాజెక్టుల ద్వారా ఆయకట్టుకు సరఫరా చేసేందుకు అవసరమైన నీటి నిల్వల లభ్యత వుందని మరో నాలుగు ప్రాజెక్టుల్లో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేవని ఇంజినీర్‌లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని సాగునీటి ప్రాజెక్టుల నుంచి ఖరీఫ్‌కు నీటి విడుదలకు తేదీలను కుడా నిర్ణయించామని చీఫ్ ఇంజనీర్ సుగుణాకర్ వివరించారు. జులై 1న తాటిపూడి నుంచి, 10న మడ్డువలస జలాశయాల నుంచి ఆయకట్టుకు నీటి విడుదల చేయాలని నిర్ణయించామని తెలిపారు. సమావేశంలో తారకరామ తీర్థ సాగరం ప్రాజెక్టు ఇఇ పి.అప్పలనాయుడు, రెగ్యులర్ డివిజన్ ఇఇ సీతారాం నాయుడు, మడ్డువలస ప్రాజెక్టు ఇఇ హెచ్.మన్మథ రావు, జలవనరుల విభాగం ఇఇ తిరుపతి రావు, డిఇలు పాల్గొన్నారు.

నాలుగు దశల్లో రోడ్లపై గుంతల్ని పూడ్చాలి

జిల్లాలో రోడ్లు భవనాల శాఖ ఆధీనంలో వున్న గుంతలు పడిన రోడ్ల మరమ్మత్తులను నాలుగు దశల్లో పూర్తి చేయాలని కలెక్టర్ అంబేద్కర్ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ పనులను వచ్చే నాలుగు వారాల్లో పూర్తిచేయాలని సూచించారు. జిల్లాలో రోడ్లు భవనాల శాఖ ఆధీనంలో వున్న 1505 వందల కిలోమీటర్ల రోడ్లలో 30 నుంచి 40 వరకు రోడ్లలో గుంతలు వున్నాయని వాటి నిర్వహణ చేపట్టాల్సి వుందని ఆ శాఖ పర్యవేక్షక ఇంజినీర్ విజయ రత్నం వివరించారు. పారాది వంతెన నిర్మాణం పనులపై సమీక్షిస్తూ సంబంధిత కాంట్రాక్టర్ వెంటనే నిర్మాణం పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఎస్ఇని ఆదేశించారు. రాజాంలో రోడ్ల విస్తరణ పనులకు కాంట్రాక్టర్‌తో మాట్లాడాలని కలెక్టర్ చెప్పారు. ఈ పనికి సంబంధించి ఇప్పటి వరకు పూర్తి చేసిన పనికి రూ.6 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించాల్సి వుందని ఎస్.ఈ. వివరించారు. సమావేశంలో ఇన్ ఛార్జ్ ఇఇ రాధాకృష్ణ, డిఇలు శ్రీనివాస్, జనార్ధన రావు, రవి కిశోర్, కెవిప్రసాద రావు, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అకడమిక్ విషయాలపై శ్రద్ధ పెట్టాలి : ఆర్‌జెడి

విజయనగరం టౌన్ : మండల విద్యా అధికారులు ప్రతి రోజూ అకడమిక్ మానిటరింగ్ విషయాలపై శ్రద్ధ తీసుకోవాలని ఆర్‌జెడి బి.విజయభాస్కర్ ఆదేశించారు. గురువారం జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో జిల్లా, మండల విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలు ప్రతి విద్యార్థికి అందించాలన్నారు. విద్యార్థుల హాజరు ప్రతిరోజు 10 గంటల 30 నిమిషాలు లోపు నమోదు చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో కాల నిర్ణయ పట్టికలు అమలు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం మెనూ అమలు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందేలా తగుచర్యలు తీసుకోవాలన్నారు. అకడమిక్ విషయాలపై శ్రద్ధ తీసుకోవాల న్నారు. సమావేశంలో డిఇఒ ప్రేమ్‌కుమార్, ఎంఇఒలు పాల్గొన్నారు.

తాండ్ర పాపారాయ కళాశాలలో

29న క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని కోమటిపల్లి వద్దనున్న తాండ్ర పాపారాయ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 29న క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల అధినేత తూముల భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. తునిలో ఉన్న డెక్కన్ ఫైన్ కెమికల్ పరిశ్రమలో ఉద్యోగాల కోసం 2017 నుంచి 2024 వరకు డిప్లొమో మెకానికల్, బి.టెక్ మెకానికల్, బిఎస్‌సి కెమిస్ట్రీ పూర్తి చేసిన పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న క్యాంపస్ ఇంటర్వ్యూలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైసిపి పాలనకు నిదర్శనం అక్రమ కట్టడాలే

ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



నిర్మాణంలో ఉన్న వైసిపి జిల్లా కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదితి

ప్రజాశక్తి-విజయనగరం కోట

అక్రమ కట్టడాలే వైసిపి పాలనకు నిదర్శనమని ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. గురువారం స్థానిక దాసన్నపేట రింగ్ రోడ్డు పక్కన నిర్మిస్తున్న వైసిపి కార్యాలయాన్ని టిడిపి, జనసేన, బిజెపి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయనగరంలో కట్టిన వైసిపి కార్యాలయం అక్రమమేనని అన్నారు. 100 శంకుస్థాపనలు 200 శంకుస్థాపనలు అని చెప్పుకొని తిరగడమే తప్ప వాస్తవంగా చేసిందేమీ లేదన్నారు ప్రతి చిన్న దానికి కొబ్బరికాయలు కొట్టి హంగామా చేసే నాయకులు పార్టీ కార్యాలయం విషయంలో ఇంత గోప్యత ఎందుకు పాటించారని అన్నారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు వైసిపిపై తిరుగుబాటు చేసి ఓటు రూపంలో కూటమికి తిరిగి లేని విజయాన్ని అందించారని అన్నారు. జిల్లాలో రెవెన్యూ వ్యవస్థ కుప్పకూలి పోయిందన్నారు. ఇది అక్రమ కట్టడమే అని కార్పొరేషన్ అధికారులు నోటీసు అంటించిన మరుక్షణమే వైసిపి నాయకులు చించి పారేయడం దుర్మార్గమని అన్నారు. ఈ అక్రమాలపై ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. బిజెపి నాయకులు భవిరెడ్డి శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఇది ముమ్మాటికీ అక్రమ కట్టడమే అన్నారు గతంలో తహశీల్దార్‌కు, కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు కార్యదర్శి గంటా పోలినాయుడు, రాష్ట్ర బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, అవనాపు విజయ్, పిల్లా విజయ్‌కుమార్, గొండేల ప్రకాష్, జనసేన నాయకులు శాంతి, రౌతు సతీష్ పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్ల రద్దు ఎఫెక్ట్

ప్రయాణికులకు ఇబ్బందులు



ప్యాసింజర్ రైళ్ల రద్దుతో రైల్వేస్టేషన్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

ప్రజాశక్తి-కొత్తవలస

ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిన చందంగా తయారైంది ప్యాసింజర్ రైళ్ల ప్రయాణికుల పరిస్థితి. ఎక్కడో రైల్వే ట్రాక్ నిర్వహణ చేపట్టినా పేదలు ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లనే రద్దు చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఇదీ సర్వసాధారణమైంది. ఎప్పుడు ఏ రైలు రద్దు చేస్తున్నారో కూడా సరైన సమాచారం ఉండటం లేదు. దీంతో తరచూ ప్యాసింజర్ రైళ్లలో ప్రయాణించే పేదలు ఇబ్బందులు పడుతున్నారు.

కొత్తవలస, కంటకాపల్లి రైల్వేస్టేషన్ మీదుగా విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లాల్సిన ప్రయాణికులు గురువారం నానా ఇబ్బందుల పాలయ్యారు. రైల్వేశాఖ అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వక పోవడంతో ప్రయాణికులు స్టేషన్ల వరకు వచ్చి వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. విశాఖ - గుణుపూర్, విశాఖ - పలాస ప్యాసింజర్ రైళ్లు రద్దు కావడం వల్ల గురువారం ఉదయం కొత్తవలస, కంటకాపల్లి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రైల్వే శాఖాధికారులు ముందస్తుగా సమాచారం ఇవ్వకపోవడంతో యథావిధిగా ప్యాసింజర్ రైళ్ల కోసం ప్రయాణికులు కొత్తవలస రైల్వేస్టేషన్‌కు చేరుకోగా రైలు రద్దయినట్టు రైల్వే సిబ్బంది సమాధానం ఇచ్చారు. ఏ కారణంతో రద్దు చేశారని స్టేషన్ మాస్టర్‌ను కోరినా ఎక్కడో రైలు పట్టాల నిర్వహణ చేపడుతున్నారని రద్దు చేశారని, అది ఎక్కడో తమకు తెలియదని సమాధానం ఇవ్వడం గమనార్హం. ఉన్న ఒక్క విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో కూడా జనరల్ బోగీలు ఖాళీలేక, అందులో ఎక్కలేక ప్లాట్‌ఫాంపై ప్రయాణికులు పరుగులు పెట్టారు. చివరికి చేసేదేమీ లేక ప్రయాణికులు బస్సుల్లో, ఇతర వాహనాల్లో విజయనగరం బయలుదేరి వెళ్లారు.

చేయూత డబ్బులు చెల్లించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నాలుగో విడత చేయూత డబ్బులను అర్హులైన లబ్ధిదారుల ఖాతాలో తక్షణమే జమ చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో స్థానిక 41 వ సచివాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా పట్టణ కార్యదర్శి వి.లక్ష్మి, సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహన్ రావు మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి 4 వ విడత చేయూత డబ్బులు రూ.18,750 చొప్పున బటన్ నొక్కినప్పటికీ ఎన్నికల కోడ్ వల్ల లబ్ధిదారుల ఖాతాల్లో జమకాలేదని, ఎన్నికల అనంతరం కొద్దిమందికి డబ్బులు వేసి, మిగతా వారికి వేయకపోవడం వల్ల మహిళలంతా ఆందోళన చెందుతున్నారని అన్నారు. గత ప్రభుత్వ నిర్ణయంతో సంబంధం లేదనే వైఖరితో టిడిపి ప్రభుత్వం ఉండడం సరికాదని, తక్షణమే స్పందించి అర్హులైన లబ్ధిదారులం దరికీ డబ్బులు చెల్లించాలని కోరారు. అనంతరం అడ్మిన్ కార్యదర్శికి వినతినిచ్చారు. కార్యక్రమంలో లక్ష్మి, రాజమ్మ, కొండమ్మ ,మంగమ్మ, నారాయణమ్మ, జ్యోతి, సత్యవతి పాల్గొన్నారు.


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే లలితకుమారి

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా కలెక్టర్ బిఆర్అంబేద్కర్‌ను శృంగవరపు కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి గురువారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా తన నియోజకవర్గ సమస్యలపై జిల్లా కలెక్టర్ తో చర్చించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని పేర్కొంటూ కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గ నాయకులు కెబిఎ రాంప్రసాద్ ఉన్నారు.

ప్రజాశక్తి కథనానికి స్పందన

చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజాశక్తి దిన పత్రికల్లో గురువారం 'కార్పొరేషన్ అధికారుల ఉదాసీనత' అనే శీర్షికన వచ్చిన కథనానికి కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పందించారు. ప్రతీరోజూ పత్రికలను పరిశీలించి, వాటిల్లో వచ్చిన వ్యతిరేక కథనాలపై చర్యలకు ఉపక్రమించారు. ఆయా కథనాలకు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని, తమకు నివేదించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.

ఉద్యోగోన్నతిపై బదిలీ అయిన ఇఒకు సన్మానం

ప్రజాశక్తి - భోగాపురం

ఉద్యోగోన్నతి పొంది బదిలీపై వెళ్లిన భోగాపురం ఇఒ ఎ. రామకృష్ణనాయుడుకు మండల పరిషత్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ చంద్రకళ, ఎంపిపి సలహాదారు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, ఇఒపిఆర్‌డి సురేష్, ఎపిఒ ఆదిబాబు, ఎపిఎం రమణ, ఇఒ సురేష్ పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఆయన చేసిన సేవలు గురించి కొనియాడారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు.

వేణుగోపాలస్వామి ఆలయాన్ని సందర్శించిన చాగంటి

బొబ్బిలి : ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు కుటుంబ సమేతంగా గురువారం పట్టణంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో పూజలు చేశారు. చాగంటి దంపతులకు ఎమ్మెల్యే బేబినాయన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరిగిపాలెంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని అరిగిపాలెం గ్రామంలో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఎస్‌సి కాలనీలో నీరు నిల్వ ఉండి బయటకు వెళ్లడం లేదు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఎంపిడిఒ ఉమ ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శి సంధ్య చర్యలకు ఉపక్రమించారు. సర్పంచ్ దుల్ల లక్ష్మి సహకారంతో జెసిబి ఏర్పాటుచేసి నిల్వ ఉన్న నీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు దుల్ల సన్యాసిరావు, గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ లీల పాల్గొన్నారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న ఎడి మహారాజన్

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-గజపతినగరం

ప్రయివేటు దుకాణాల్లో నాసిరకం విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ ఎడి మహారాజన్ హెచ్చరించారు. గురువారం మండలంలోని సత్యసాయి ట్రేడర్స్ విత్తన దుకాణాన్ని పరిశీలించారు. విత్తన నమూనాలు తీసి పరీక్షా కేంద్రానికి పంపించాలని ఎంఎఒ సిహెచ్ ధనలక్ష్మిని ఆదేశించారు. నాణ్యత గల విత్తనాలను మాత్రమే రైతులకు అందివ్వాలని, ధరల వివరాలను బయట బోర్డులో పెట్టాలని దుకాణ యజమానికి సూచించారు. రైతులు విధిగా మొలకశాతం లెక్క కట్టిన తరువాతే నారు పోసుకోవాలని చెప్పారు.

విత్తనాలు పంపిణీ

శృంగవరపుకోట : శృంగవరపుకోట పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ జి.సంతోషికుమారి గురువారం రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విఎఎలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

వేపాడ : మండలంలోని ఎ.ఎస్.పేట, వేపాడ, ఎంకెఆర్ పురం, సోంపురం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ప్రధానోపాధ్యాయుల బృందం గురువారం పరిశీలించింది. ఎలా అమలు చేస్తున్నారో ఆరా తీసింది. ఈ పరిశీలనలో హెచ్ఎం ఎస్.ఎస్.వల్లి, తదితరులు పాల్గొన్నారు.

కాపు సంక్షేమ సంఘ నాయకులకు జెడ్‌పి చైర్మన్ అభినందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల నూతనంగా ఎన్నికైన కాపు సంక్షేమ సంఘం నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అంబళ్ల అప్పలనాయుడు, ఆర్లె కృష్ణారావును, కార్యవర్గ సభ్యులను జెడ్‌పి చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు అభినందించారు. గురువారం తన నివాసంలో చైర్మన్‌ను సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన అభినందిస్తూ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

మంత్రిని కలిసిన గౌరు

ప్రజాశక్తి-బాడంగి

రాష్ట్ర స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని గురువారం తన నివాసంలో గజరాయునివలస ఎంపిటిసి పాలవలస గౌరు మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో మంత్రిని ఘనంగా సన్మానించారు. గిరిజనులు, ఎరుకుల సామాజిక తరగతి సమస్యలపై వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వంలో తనకు ఆర్థికంగా నష్టం వచ్చేలా ఇబ్బందులకు గురిచేశారని వివరించారు..


మంత్రి సంధ్యారాణితో పాలవలస గౌరు

లింగనిర్ధారణ పరీక్షలపై చర్యలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి- చీపురుపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శాంతి

లింగనిర్ధారణ పరీక్షలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ బి.శాంతి అన్నారు. విజయనగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో గురువారం పిసి అండ్ పిఎన్‌డిటి(లింగ నిర్ధారణ నిరోధక) చట్టం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సంఘంలో నెలకొని ఉన్న పురుష సంతాన ప్రాధాన్యత, ఆడపిల్లల పట్ల వివక్షత, మూఢనమ్మకాలు వంటి వివిధ సామాజిక కారణాల దృష్ట్యా కడుపులో పెరుగుతున్నది ఆడ శిశువు అని తెలిస్తే గర్భస్రావాలు చేయించుకోవడం విపరీతంగా పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ప్రభుత్వం 0-6 సంవత్సరాలు బాలికల లింగ నిష్పత్తిని పెంచడానికి లింగ నిర్ధారిత పరీక్షల నిరోధ చట్టంను కఠినంగా అమలు చేస్తోందన్నారు. చీపురుపల్లి డివిజనలో ఏస్కాన్ సెంటర్ వారైన లింగ నిర్ధారణ చర్యలకు పాల్పెడితే వారిపై 1994 చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో చీపురుపల్లి ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎన్. సూర్యనారాయణ, ఎం. మహేష్‌కుమార్, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎం.నాయక్, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ ప్రశాంత్, హ్యూమన్ రైట్స్ ప్రతినిది వి. పద్మలత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుంచి డెమో చిన్నతల్లి, ఎం. చాముండేశ్వరి, హెల్త్ ఎడ్యుకేటర్ పవన్, ఆశిష్, డెమో సెక్షన్ సభ్యులు పాల్గొన్నారు.

మొదటి రోజే పింఛన్ల పంపిణీ పూర్తి కావాలి

ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే పంపిణీ చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో పెన్షన్ల పంపిణీ మొదటి రోజే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎంపిడిఒలకు సూచించారు. జూలై 1న 2 లక్షల, 81 వేల 713 మందికి 186.89 కోట్ల రూపాయల పింఛను పంపిణీ చేయనున్నామని తెలిపారు. ఎక్కడైనా మిగిలి ఉంటే 2వ తేదీ నాటికి శత శాతం పంపిణీ జరిగేలా చూడాలని తెలిపారు. గురువారం పించన్ల పంపిణీపై ఎంపిడిఒలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పింఛను పంపిణీ కేవలం ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే చేయాలని, తాత్కాలిక ఉద్యోగులు పాల్గొనరాదని స్పష్టం చేసారు. ఇందుకోసం వెంటనే క్లస్టర్ వారీగా సిబ్బంది మాపింగ్ జరగాలని, 50 నుండి 60 మందిని ఒక క్లస్టర్ లో చేర్చాలని, ఆ వివరాలను శుక్రవారం ఉదయం అందించాలని ఆదేశించారు. శనివారమే పింఛన్ల నగదును బ్యాంకుల నుండి డ్రా చేయాలని, అవసరమైతే పోలీస్ వారి సహకారాన్ని తీసుకోవాలని తెలిపారు. నగదు డ్రా చేయడానికి పంచాయతి సెక్రటరీ తో పాటు వెల్ఫేర్ అసిస్టెంట్ కూడా వెళ్లాలని అన్నారు. బయో మాట్రిక్ యంత్రాలను ఒకసారి తనిఖీ చేసుకొని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పింఛను అందజేసిన తర్వాత ఎకనాలెడ్జ్‌మెంట్ తీసుకోవాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఒ అనిత, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, డిపిఒ శ్రీధర్ రాజా, జీస్.డబ్ల్యు అధికారి నిర్మలా దేవి తదితరులు పాల్గొన్నారు.


వ్యాధులు ప్రబలకుండా చర్యలు

బొబ్బిలి : వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం అధికంగా ఉందని, ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శానిటేషన్ ఉద్యోగులను కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం శానిటేషన్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాలువల్లో పూడికలు ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. తాగునీరు సరఫరా చేసే సమయంలో పర్యవేక్షణ చేయాలని కోరారు. పైపులైన్ లీకులు ఉంటే గుర్తించి నివారించాలని సూచించారు. తాగునీరు వృథా చేయకుండా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. అపార్టుమెంట్లలో చెత్తను ఆన్ సైట్ కంపోస్టింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ శివ, ఉద్యోగులు పాల్గొన్నారు.

గంజాయిపై విచారణ ప్రారంభం

ప్రజాశక్తి - భోగాపురం

రాష్ట్ర ప్రభుత్వం గంజాయి మత్తు వదిలించాలని ప్రయత్నిస్తుంటే యువత మాత్రం గంజాయి మత్తులో తేలుతున్నారు. తాజాగా అమనాం వద్ద గురువారం జరిగిన ఉదంతమే దీనికి నిదర్శనం. గంజాయి మత్తులో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఫ్యామిలీని గంజాయి మత్తులో ఉన్న యువకులు ఢీ కొట్టిన విషయం తెలిసిందే. పోలీసుల అదుపులో ఉన్న యువకుల వద్ద 13 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై విచారణ కూడా సాగిస్తున్నారు. పట్టుబడిన యువకుల్లో ఒకరు రావాడ గ్రామానికి చెందిన వ్యక్తి కాగా మరో యువకుడు విశాఖ జిల్లా ఆనందపురం గ్రామమని చెబుతున్నారు. ఆనందపురం గ్రామానికి చెందిన యువకుడికి ఫ్యామిలీని ఢీకొట్టిన ప్రమాదంలో గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుత రావాడ గ్రామానికి చెందిన వ్యక్తి పోలీసుల అదుపులో ఉన్నాడు. వీరి వద్ద 13 గ్రాముల గంజాయి పొట్లాలు లభించడంతో వీటిని ఎక్కడ కొనుగోలు చేశారనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కానీ యువకులు మాత్రం దీనిని చెప్పేందుకు నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ పోలీసులు మాత్రం వారి వద్ద నుంచి ఆరా తీసేందుకు ప్రయత్నిస్తున్నారు.



బీమా చెక్కు అందజేస్తున్న ఎస్‌బిఐ ఆర్ఎం భూషణ్ సాహు

ఎస్‌బిఐ బీమాతో బహుళ ప్రయోజనకరం

రీజనల్ మేనేజర్ భూషణ్ సాహు

ప్రజాశక్తి-రామభద్రపురం

ఎస్‌బిఐ బీమా పథకాలు బహుళ ప్రయోజనకరమని బొబ్బిలి రీజినల్ మేనేజర్ భూషణ్ సాహు తెలిపారు. స్థానిక ఎస్‌బిఐ బ్రాంచ్ ఆవరణలో గురువారం బ్యాంకు బీమా పథకంలో చేరి ఆకస్మిక మరణానికి గురైన కుటుంబానికి చెందిన వారసులకు బీమా పరిష్కార చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తక్కువ ప్రీమియంతో అధిక ప్రయోజనాలు ఇచ్చే బీమా పథకాలలో ఖాతాదారులు చేరాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ హరీంద్ర, సిబ్బంది రమేష్, లక్షుంనాయుడు, ధర్మారావు, శ్రావణి, బిసి పాయింట్ ప్రతినిధి పి.వి.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఫేక్ కాల్స్ పట్ల అప్రమత్తం

ఎస్‌పి ఎం.దీపిక

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఇటీవల ఫెడెక్స్, బ్లూడాట్ కొరియర్స్, డిజిటల్ అరెస్టు, బిట్ కాయిన్స్, క్రిప్టో కరెన్సీ అనే పేర్లతో వచ్చే కాల్స్, లింక్స్, వీడియో కాల్స్ తో ప్రజలు సైబరు మోసాలకు గురవుతున్నారని, ఇటువంటి నకిలీ కాల్స్, యాప్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి ఎం. దీపిక సూచించారు. ఈ తరహా కాల్స్, లింక్స్ వీడియో కాల్స్‌తో సైబరు మోసగాళ్లు ప్రజలకు ఉచ్చు వేస్తూ, వారి నుండి భారీగా డబ్బులు కొల్లగొడుతున్నారన్నారు. సైబర్ మోసగాళ్లు ఫోను చేసి తాము ఫెడెక్స్ లేదా బ్లూడాట్ కొరియర్స్ నుండి మాట్లాడుతున్నామని, మన చిరునామా, ఆధార్ నంబరు, ఫోను నంబరు వంటి కొంత సమాచారాన్ని ముందుగా మనకు తెలిపి, మనం బుక్ చేసిన కొరియర్ పార్సిల్లో నిషేదిత మాదక ద్రవ్యాలు, ఫేక్ పాస్‌పోర్టు, బంగారం వంటివి ఉన్నాయని, కేసు కూడా నమోదయ్యిందని, విచారణ నిమిత్తం తాము సూచించిన ప్రాంతానికి దర్యాప్తు నిమిత్తం రావాల్సి ఉంటుందన్న సమాచారాన్ని అందిస్తారన్నారు. ఫోనును కేసు దర్యాప్తు చేస్తున్న సిబిఐ లేదా టాస్క్ ఫోర్స్ లేదా పోలీసు అధికారులకు కలుపుతామని తెలిపి, వేరే వ్యక్తులకు ఫోను కనెక్ట్ చేస్తారన్నారు. అనంతరం మోసగాళ్లు తమను పోలీసు అధికారిగా లేదా సిబిఐ అధికారిగా, ఒక ప్రత్యేక దర్యాప్తు సంస్థకు చెందిన వ్యక్తిగా పరిచయం చేసుకొంటూ, తన గుర్తింపు కార్డుగా నకిలీ ఐడి కార్డును పంపి, బుక్ చేసిన పార్సిల్ లో మాదక ద్రవ్యాలు ఉన్నాయని, బంగారం, నకిలీ పాస్ పోర్టు వంటి వస్తువులు ఉన్నాయని, కేసు కూడా నమోదయ్యిందని, దర్యాప్తు నిమిత్తం తమ వద్దకు రావాల్సి ఉంటుందని భయపెడతారన్నారు. తాము రాలేని పరిస్థితుల్లో ఉన్నామని చెబితే, ఆన్లైనులో కూడా దర్యాప్తుకు హాజరుకావచ్చునని, తమకు ఒక లింకు పంపుతున్నామని, వాటిపై క్లిక్ చేసి, స్కైప్ లో దర్యాప్తుకు హాజరుకావాలని సూచిస్తారన్నారు. సైబరు మోసగాళ్ళ పంపిన లింకును క్లిక్ చేస్తే, తమ బ్యాంకు సేవింగు ఖాతాల్లోని నగదు చోరీకి గురవుతుందన్నారు. ఇలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి సూసించారు. మీ బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు, మొబైళ్లకు వచ్చే ఒ.టి.పి.లను ఎవరికీ చెప్పవద్దన్నారు. ఈ తరహా నేరాల్లో ఎవరైనా నగదును పోగొట్టు కొన్నట్లయితే 1930 కు లేదా నేషనల్ సైబరు క్రైం పోర్టల్‌లో రిపోర్టు చేయాలని ఎస్‌పి కోరారు.

వ్యాధులపై జాగ్రత్త వహించండి : డిఎంహెచ్ఒ

శృంగవరపుకోట : వర్షాకాలం వ్యాధులు ప్రబలే కాలమని, అందరూ జాగ్రత్తలు వహించాలని డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు సూచించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా మండలంలోని దబ్బగుంట గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పరిసరాలలో నీరు నిల్వ ఉంటే దోమలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. వర్షాకాలం కావడంతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమలు అభివృద్ధి చెందకుండా పరిసరాలలో ఉన్న నీటి నిల్వలు తొలగించి, శుభ్రం చేసుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. దోమతెరలను వాడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీషా, డాక్టర్ వెంకటేష్, చంద్రశేఖర్, ఎపిడమిక్ సెల్ అధికారి జె.సత్తిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు చేపట్టాలి : ఆర్‌డిఒ

గంట్యాడ : ప్రస్తుతం సీజన్‌లో డయేరియా, డెంగీ, మలేరియా వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ అధికారులను ఆదేశించారు. గురువారం తహశీల్దార్ కార్యాలయం లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలుషిత నీటి వల్ల డయేరియా వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. తాగునీటి కుళాయిల వద్ద మురుగునీటి నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా పారిశుధ్య కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. హోటళ్లు, డాబాల్లోని వ్యర్థ పదార్థాలను బయట పారవేయకుండా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని యజమానులకు ఆదేశాలు ఇవ్వాలన్నారు ప్రతి గ్రామంలో కార్యదర్శులు పరిశుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఎంపిడిఒ భవాని, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ సంతోష్, గంట్యాడ, పెదమజ్జిపాలెం పిహెచ్‌సి వైద్యాధికారులు హేమలత, వెంకటేష్, పల్లవి పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న ఆర్‌డిఒ సూర్యకళ

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

పజాశక్తి - భోగాపురం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే లోకం మాధవి గురువారం ప్రారంభించారు. సవరవల్లి సబ్ స్టేషన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు సరఫరా చేసే విద్యుత్ విషయంలో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూడాలన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. విద్యుత్ శాఖ ఎస్ఇ లక్ష్మణరావు మాట్లాడుతూ 5వేలు కెవి కేపాసిటీ గల ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను రూ. 2.50లక్షలతో ఏర్పాటు చేశామన్నారు. దీని ద్వారా కేవలం విమానాశ్రయం నిర్మాణానికి కావాల్సిన విద్యుత్తును మాత్రమే సరఫరా చేస్తామన్నారు. విమానాశ్రయానికి పూర్తి స్థాయిలో మరోచోట నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇఇ సురేష్ బాబు, డిఇఇ సత్య పరిపూర్ణ కుమార్, ఎఇలు మస్తాన్ వలి, అప్పలనాయుడు, నాయకులు మట్టా అయ్యప్ప రెడ్డి, బాల అప్పలరాజు, పిల్లంట్ల జగదీశ్, పల్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి

గురుకులాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శృంగవరపుకోట

లక్కవరపు కోట మండలంలోని రంగాపురం జ్యోతిబాపూలే గురుకుల (బాలికలు) పాఠశాలను ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో తరగతి గదులు, వసతిగృహాన్ని, ల్యాబ్‌ను పరిశీలించారు. విద్యార్థినులను విద్య, వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో నెల్లిమర్ల గురుకులంతో పోటీ పడి ముందంజలో నిలిచారని, ఈ సంవత్సర పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మంచి మార్కులు వచ్చాయని ఎమ్మెల్యే తెలిపారు. పాఠశాలలో పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. సాహసం ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాచవరపు గణేష్ సహకారంతో మూడు కంప్యూటర్లు, ప్రొజెక్టర్, పుస్తకాలు పెట్టుకోవడానికి ఒక ర్యాక్ అందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపిపి కొల్లి రమణమూర్తి, టిడిపి మండల అధ్యక్షులు చొక్కాకుల మల్లు నాయుడు, జిఎస్ నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి ఇందుకూరి శ్రీనిరాజు, గొంప దుర్గా ఉమేష్, ప్రిన్సిపల్ విజయ్ కుమార్ పాత్రో, నెల్లిమర్ల ప్రిన్సిపల్ సిహెచ్ రామమోహని, సాహసం స్టేట్ ఎడ్యుకేషన్ అడ్వైజర్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.


గురుకుల సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

ఉద్యోగ మేళాలో 127 మంది ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా కేంద్రంలోని ఎం ఆర్ అటానమస్ కళాశాలలో గురువారం నిర్వహించిన ఉద్యోగ మేళాలో 127 మంది యువతీ యువకులు తదుపరి దశకు ఎంపిక అయినట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి. అరుణ తెలిపారు. జాబ్ మేళాకు 284 మంది హాజరు కాగా ముత్తూట్ ఫిన్ కార్ప్, హెట్రో ల్యాబ్స్, జాబ్ డీలర్స్ సంస్థలు ఈ జాబ్ మేళాకు హాజరై నిరుద్యోగ యువతను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

29న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 29వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతాయని సిఇఒ ఎల్ఎన్‌వి శ్రీధర్ రాజా తెలిపారు. 1 నుంచి 7వ స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని, సంబంధిత అధికారులు,సభ్యులు హాజరు కావాలని కోరారు.

కార్యదర్శులు బాధ్యతగా ఉండాలి

ప్రజాశక్తి-వేపాడ

పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించాలని ఎంపిడిఒ ఉమ ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులకు సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేస్తున్న వారికి సమాధానం ఇవ్వకుండా, డబ్బులు ముట్టచెపుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అటువంటి వారిపై తన వద్దకు అప్పీలు వస్తే చట్టపరమైన చర్యల కోసం రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషర్‌కు సిఫార్సు చేస్తానని హెచ్చరించారు. ఆర్‌టిఐ ద్వారా దరఖాస్తు చేస్తే సమాచారం అందించడం మన బాధ్యతని, అంతే తప్ప బాధ్యతారహితంగా వ్యవహరిస్తే సహించేది లేదని చెప్పారు.

పాముకాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని గుజ్జంగివలస గ్రామంలో పాము కాటుతో అట్టాడ లక్ష్మి (58) బుదవారం రాత్రి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మి గ్రామంలో రోడ్డు పక్కన చిన్న పాన్ షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తుంది. రోజూ లాగే పాన్ షాపు బుదవారం ఉదయం తెరచి సామాన్లు తీస్తుండగా గుర్తు తెలియని విష పాము షాపుపై నుంచి ఆమె ఎడమ చేతి మీద పడి కాటు వేసింది. వెంటనే ఆమె గుర్ల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళింది. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి ఆమెను బంధువులు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతురాలు కుమారుడు అప్పల నాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర రావు తెలిపారు. ఇది ఇలా ఉండగా ఇటీవల కాలంలో మృతిరాలి భర్త, కుమార్తె అనారోగ్యంతో మృతి చెందారు.

444 మద్యం సీసాలు ధ్వంసం

ప్రజాశక్తి-బొండపల్లి

బొండపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం ఎక్సైజ్ సిఐ డి.వి.జి రాజు పర్యవేక్షణలో 444 మద్యం సీసాలు ధ్వంసం చేశారు. 18 కేసుల్లో 444 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు బొండపల్లి ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. మద్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వన్నె తెచ్చిన ఉపాధ్యాయ వృత్తి

ప్రజాశక్తి - వేపాడ

తనకు, తన కుటుంబానికి ఉపాధ్యాయ వృత్తి వన్నె తెచ్చిందని ఉపాధ్యాయుడు మంచిని సన్యాసిరావు అన్నారు. వీలుపర్తి ఆర్‌సిఎంస్ పాఠశాల నుంచి డెప్యుటేషన్‌పై బొబ్బిలి మండలం కృష్ణాపురం ప్రాథమిక పాఠశాలకు వెళ్లిన ఆయన ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందుతున్నారు. ఈ నేపథ్యంలో జీవిత విశేషాలు, ఉద్యోగ అనుభవాలను ప్రజాశక్తితో పంచుకున్నారు.

మాది వేపాడ మండలంలోని ఆకులసీతంపేట గ్రామం. నా తల్లిదండ్రులు మంచిన అప్పన్నదొర, తల్లి సూర్య నారాయణమ్మ లకు నేను మొదటి సంతానంగా జులై 1, 1962లో జన్మించాను. నా తరువాత ఇద్దరు తమ్ముళ్లు, చెల్లి పుట్టారు. మా గ్రామంలోనే ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి, వేపాడ ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యనభ్యసించాను. ఎస్.కోట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్, అనకాపల్లిలో ఎఎంఎఎల్ కళాశాలలో డిగ్రీ బిఎ(1982-1984) విద్యాభ్యాసం సాగింది. డిగ్రీ పూర్తయిన తరువాత సంవత్సరమే మా గ్రామానికి చెందిన గంగతల్లితో వివాహమైంది. 1985-1990 వరకు గ్రామంలో టిడిపి తరుపున రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించాను. అదే సమయంలో వేపాడ మండల తెలుగు యువత అధ్యక్షులుగా కూడా పనిచేశాను. 1990లో మరలా బిఇడి.. ఎంఆర్ కాలేజీలో చదివాను. ఆంధ్ర యూనివర్సిటీలో పట్టా పొందాను.

తొలి పోస్టింగ్ అక్కడే

1994 జులై 12న వీలుపర్తి ఆర్‌సిఎం ఎయిడెడ్ ప్రైమరీ స్కూల్లో సెకండరీ గ్రేడ్ టీచరుగా జాయిన్ అయ్యాను. సుమారు అక్కడే ఉపాధ్యాయ వృత్తిలో గతేడాది జులై 19వ తేది వరకూ కొనసాగాను. తరువాత బొబ్బిలి మండలం కృష్ణాపురం డెప్యుటేషన్‌పై వెళ్లి అక్కడే ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందుతున్నాను. ఒకే గ్రామంలో అన్ని సంవత్సరాలు పనిచేయడం నాకు ఆనందాన్నిచ్చింది. గ్రామస్తులంతా సొంత కుటుంబ సభ్యులు మాదిరిగా అలవాటైపోయారు.

మాది వ్యవసాయ కుటుంబమే

మాది వ్యవసాయ కుటుంబమే. మేమంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువులు సాగించాం. నా వద్ద చదువుకున్న విద్యార్థుల్లో అధిక శాతం మంది ఉద్యోగాలతో పాటు, ఉన్నతమైన స్థితిలో ఉన్నారు. నా భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అదే నాకు తీరని లోటుగా ఉంది. చాలా కాలం ఈ విషయంపై బాధపడ్డాను. నాకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు బి.టెక్ పూర్తి చేసి రైల్వే ఉద్యోగం చేస్తున్నారు. కుమార్తె ఎంఎస్‌సి బిఇడి చేసి, బక్కునాయుడుపేట ఎపి మోడల్ స్కూల్ హాస్టల్లో వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కుమార్తెను రైల్వే ఉద్యోగి చామంతుల రాంప్రసాద్‌కి ఇచ్చి వివాహం చేశాను. వారికి ఇద్దరు పిల్లలున్నారు. ఉద్యోగ విరమణ తరువాత గ్రామంలోనే నా శేష జీవితాన్ని గడపాలని భావిస్తున్నాను. గ్రామస్తులకు నాకు చేతనైన సాయం చేస్తూ ప్రతి ఒక్కరూ చదువుకునే విధంగా కృషి చేస్తాను. ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించి రాజకీయాలకు అతీతంగా ప్రజలను చైతన్య పరుస్తాను. వీటితో పాటు దైవ కార్యక్రమాలు ఏర్పాటు చేసి శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని భావిస్తున్నాను.

